సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 27 । జూన్ । 2024



తగ్గుతున్న చీనీ ధరలు

చీనీ ధరలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేలు మాత్రమే పలికాయి.



'కోటంక' చోరీ కేసు ఛేదింపు

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు రొద్దం మండలం తురకలపట్నం వాసిగా తేల్చారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.2°/22.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వృద్ధుడిని బలిగొన్న డయేరియా



దయేరియా బాధితులతో నిండిపోయిన ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రి (ఇన్‌సెట్) నాగేంద్ర (ఫైల్)

ఉరవకొండ: జిల్లాలో డయేరియా మరణాలు ఆగడం లేదు. రెండు రోజుల క్రితం పామిడి మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామానికి చెందిన రేణుక (22) డయేరియాతో మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన పెద్దమ్మ (60) వ్యాధి బారిన పడి 5 రోజుల క్రితం కన్ను మూసింది. ఈ రెండు ఘటనలు మరువకముసుపే తాజాగా బుధవారం ఉరవకొండలో ఓ వృద్ధుడు డయేరియాతో మృతి చెందాడు. ఉరవకొండ మండలం చిన్నముస్టూరు గ్రామానికి చెందిన కురబ నాగేంద్ర (75) స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. రెండు రోజులుగా తీవ్ర వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న నాగేంద్రను బుధవారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబసభ్యులు తీసుకురాగా, చికిత్స ఫలించక ఆయన కన్నుమూశాడు.

వారం రోజుల్లోనే 50కి పైగా కేసులు..

ఉరవకొండ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే 50 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. డయేరియా వ్యాధిగ్రస్తులతో ఉరవకొండ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. రోజూ ఐదుగురి నుంచి ఆరుగురు డిశార్చ్ అవుతున్నా, కొత్త కేసులు 10 వరకూ నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

గోరంట్ల: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పనిచేసిన కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రఘుపతిరెడ్డి వైఎస్సార్ సీపీలో చురుకైన కార్యకర్త. సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం తీవ్రంగా పని చేశారు. దీన్ని మనసులో ఉంచుకున్న టీడీపీ నాయకులు రఘుపతిరెడ్డిపై కక్ష గట్టారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కమ్మ ఆదినారాయణ, ఈడిగి మల్లికార్జున మరికొంతమంది మంగళవారం రాత్రి రఘుపతిరెడ్డి ఇంట్లో లేని సమయంలో ఆయన భార్యతో గొడవపడ్డారు. మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడారు. అనంతరం ఇంటికి వచ్చిన రఘుపతి రెడ్డి గొడవ గురించి తెలుసుకుని ఇది పద్ధతి కాదని చెప్పేందుకు కమ్మ ఆదినారాయణ, ఈడిగ మల్లికార్జున వద్దకు వెళ్లాడు. రాజకీయంగా పోరాడాలి గానీ మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో ఇళ్లపైకి రావడం భావ్యం కాదని చెప్పారు. అప్పటికే రఘుపతిరెడ్డి కోసం ఎదురు చూస్తున్న వారు...అతనితో గొడవకు దిగారు. కర్రలతో చితకబాదారు. అడ్డు తగిలిన రఘుపతిరెడ్డి మామ శివారెడ్డిని సైతం విక్షణరహితంగా కట్టెలతో దాడి చేశారు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన రఘుపతిరెడ్డిని, అతని మామ శివారెడ్డిని స్థానికులు మంగళవారం రాత్రే హిందూపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన బాధితులు బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మలేరియా నిర్ధారణలో రక్తపూతల పరిశీలన కీలకం

- డీఎంహెచ్‌ఓ మంజువాణి



రక్త పూతలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

ప్రశాంతి నిలయం: మలేరియా వ్యాధి నిర్ధారణలో రక్త పూతల పరిశీలన ఎంతో కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మంజువాణి అన్నారు. బుధవారం ప్రశాంతి గ్రాం వద్ద ఉన్న వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల ల్యాబ్ టెక్నీషియన్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. రక్త పూతల సేకరణ, పరిశీలన, మలేరియా నిర్ధారణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధుల నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లదే కీలక పాత్ర అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు చేసి ఫలితాలు వేగవంతంగా ఇవ్వాలన్నారు. తద్వారా సరైన చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయక్, ప్రోగ్రాం అధికారి లక్ష్మేనాయక్ పాల్గొన్నారు.

సైబర్ దందా.. సరికొత్త పంథా

- కొత్తచెరువుకు చెందిన ముగ్గురు యువకులకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉద్యోగాల పేరిట గాలం వేశాడు. ఎలాంటి నైపుణ్యం లేకపోయినా నెలకు రూ.20 వేలు సంపాదించవచ్చని నమ్మబలికాడు. ఒక్కొక్కరితో రూ.25 వేల చొప్పున లాగాడు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేశాడు. మోసపోయామని తెలుసుకున్న యువకులు పోలీసులను ఆశ్రయించారు. మోసగాడి నుంచి డబ్బు తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరారు.
- రామగిరికి చెందిన ఓ బీటెక్ విద్యార్థికి ఓ ఆగంతకుడు ఫోన్ చేశాడు. నెలకు రూ.80 వేల జీతం ఉండే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పగానే.. టక్కున రూ.లక్ష నగదు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశాడు. ఆ తర్వాత మూడు నెలలు వేచి చూసినా ఆఫర్ లెటర్ రాలేదు. దీంతో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఉద్యోగ ప్రకటనను చూసి సంప్రదించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మంచి వేతనంతో పాటు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికారని ఆవేదన వ్యక్తం చేశాడు.
- బుక్కపట్నం మండలానికి చెందిన ఓ బీటెక్ విద్యార్థికి ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఇంటివద్దే ఉండి డబ్బు సంపాదించవచ్చని సదరు వ్యక్తి చెప్పాడు. అందుకు ఫీజుల రూపంలో కొంత చెల్లించాలని చెప్పగా.. సదరు యువకుడు ఆన్‌లైన్‌లో రూ.1.5 లక్షలు చెల్లించాడు. రోజులు గడిచినా సమాధానం రాకపోవడం...డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. సంబంధిత ఫోన్ నంబరుకు కాల్ చేయగా.. విద్యార్థి డేటా ఎంట్రీలో తప్పులు దొర్లడంతో జాప్యం జరుగుతోందని సమాధానం వచ్చింది. మరో రెండు నెలల్లో ఉద్యోగం వస్తుందని నమ్మబలుకుతూ... ఆర్నెల్లు గడిపినట్లు బాధితుడు పేర్కొన్నాడు.



- ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు టోకరా
- బాధితులంతా ఉన్నత విద్యావంతులే
- రోజుకో చోట వెలుగు చూస్తున్న ఘటనలు
- నష్టం జరిగిపోయాక పోలీసులను ఆశ్రయిస్తున్న వైనం

సాక్షి, పుట్టపర్తి

ఉద్యోగాల పేరుతో టోకరా వేస్తున్న కేటుగాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సరికొత్త విధానాలతో వల వేసి రూ.లక్షలు దోచేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి.. అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. ఆన్‌లైన్ జాబ్, పార్ట్ టైమ్ జాబ్స్, డేటా ఎంట్రీ ఉద్యోగాలు, వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్స్.. పేరుతో నిరుద్యోగ యువతను నిండా ముంచేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా ఉన్నత విద్యావంతులే ఉంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే బలహీనత కలిగిన వాళ్లే ఎక్కువగా సైబర్ మోసగాళ్ల వలలో పడుతున్నట్లు తెలుస్తోంది.

డబ్బు లాగడమే లక్ష్యం..

ప్రస్తుత కాలంలో చాలామంది స్వగ్రామంలో ఉంటూ పని చేయడానికే ఇష్టపడుతున్నారు. జాబ్ స్కామ్ చేసేవాళ్లు అలాంటి వారినే లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించే ఉద్యోగాలు తమ కంపెనీల్లో అందుబాటులో ఉన్నాయని నమ్మబలుకుతారు. ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తూ ఫీజులు, రిజిస్ట్రేషన్ రూపంలో డబ్బు లాగడమే పనిగా పెట్టుకున్నారు. ఇలాంటి ప్రకటనలన్నీ.. వాట్సాప్‌లలో మాత్రమే కనిపిస్తాయి. అలాంటి వాటిని నమ్మి మోసపోతున్న వారు చాలా మంది ఉంటున్నారు.

తప్పులు దొర్లాయంటూ దబాయింపు..

ఇంటి వద్దే ఉంటూ డబ్బు సంపాదించవచ్చని చెప్పే ఉద్యోగాల్లో మొదట బయోడేటా తీసుకుంటారు. ఆ తర్వాత ఫీజులు, రిజిస్ట్రేషన్ల పేరుతో డబ్బులు లాగేస్తారు. ఆఫర్ లెటర్ వస్తుందని మాయమాటలు చెబుతారు. ఆ తర్వాత ఎన్నిసార్లు కాల్ చేసినా స్పందన ఉండదు. ఫోన్‌లో అందుబాటులోకి వచ్చినా.. మీ ప్రతిభ సరిగా లేదని.. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లాయని.. మరోసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సెలెక్ట్ అవుతారని చెబుతారు. ఇలాంటి ఘటనలు తరచుగా వెలుగు చూస్తున్నాయి. మరికొంత మంది మోసగాళ్లయితే ఇప్పటికే డేటా ఎంట్రీ వర్క్ ఇచ్చాం. మీరు చేయలేదు...దీనివల్ల తమ కంపెనీకి చాలా నష్టం వచ్చిందని, ఇందుకు పరిహారం చెల్లించాలని ఉత్తుత్తి లీగల్ నోటీసులు పంపుతూ భయపెడుతున్నారు.

అబద్ధాలను నమ్మబలుకుతూ..

ఉద్యోగ ప్రకటనలు నిజమా.. కాదా? నిర్ధారించుకోకుండా.. ఫోన్ కాల్స్ ద్వారా చెప్పిన ప్రకటనలను చాలా మంది నమ్ముతున్నారు. ప్రముఖ సంస్థలు రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు పేరిట ఎప్పుడూ నగదు వసూలు చేయవని తెలిసీ.. మోసపోతున్నారు. క్విక్ మనీ, అన్‌లిమిటెడ్ ఎర్నింగ్స్, నో టెక్నికల్ స్కిల్స్ వంటి వాటిని ఉపయోగించి మోసగాళ్లు అమాయకుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయాలని భావించే విద్యావంతులే ఎక్కువగా మోసపోతున్నారు. ఉద్యోగ ప్రకటనలపై ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకోవాలి. డబ్బులు ఇచ్చే ముందు అలాంటి కంపెనీల్లో తెలిసిన వాళ్లు ఎవరైనా ఉద్యోగం చేస్తుంటే ఆరా తీయాలి. ఉద్యోగం కావాలంటే కోచింగ్ వెళ్లి కోర్సులు చేయండి.. అక్కడే ప్లేస్‌మెంట్ ఇస్తారు. అంతేకానీ ఆన్‌లైన్‌లో అడ్డమైన వెబ్‌సైట్‌లలో వచ్చే సమాచారం నమ్మి మోసపోకండి. ఉద్యోగాలు ఇప్పిస్తామని వచ్చే కాల్స్‌కు స్పందించకుంటే సమస్యే ఉండదు.

– ఎస్వీ మాధవరెడ్డి, ఎస్పీ

ఇంటర్ సప్లిమెంటరీలో 41 శాతం ఉత్తీర్ణత

పుట్టపర్తి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 41 శాతం ఉత్తీర్ణత సాధించారు. బుధవారం సాయంత్రం అధికారులను ఫలితాలు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 3,627 మంది విద్యార్థులకు గాను 1,495 మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. ఇక ఒకేషనల్ సబ్జెక్టుల్లో 44 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 940 మంది విద్యార్థులకు గాను 418 మంది, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 71 మందికి 57 మంది, వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 34 మందికి 24 మంది, ఏపీఆర్‌జేసీ నుంచి 16 మందికి గాను ఏడుగురు, కేజీబీవీల్లో 229 మంది విద్యార్థినులకు 106 మంది, ఏపీ మోడల్ స్కూళ్లలో 227 మంది విద్యార్థులకు గాను 102 మంది, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 2,000 మందికి గాను 714 మంది ఉత్తీర్ణత సాధించారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాకు 16వ స్థానం

- 68.93 శాతం మంది ఉత్తీర్ణత

పుట్టపర్తి: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాకు 16వ స్థానం దక్కింది. బుధవారం అధికారులు పదో తరగతి ఫలితాలు విడుదల చేశారు. జిల్లా నుంచి 4,934 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 3401 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. మొత్తంగా 68.93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె వెల్లడించారు. ఇందులో 3,327 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 2201 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే 1,607 మంది బాలికలు పరీక్షలు రాయగా, 1,200 మంది పాసైనట్లు తెలిపారు.

'మత్తు'కు దూరంగా ఉందాం



హిందూపురంలోని బెంగళూరు రోడ్డు మీదుగా సాగుతున్న ర్యాలీ



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

- బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం
- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్: జీవితాలను తలకిందులు చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హిందూపురంలో పోలీస్ అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్నమార్కెట్ వద్ద ఎస్పీ మాధవరెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ బెంగళూరు రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం ప్రజలనుద్దేశించి ఉద్దేశించి ఎస్పీ మాట్లాడారు. కొందరు యువత, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు మత్తుకు అలవాటు పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసలుగా మారిన వారి వల్ల ఆయా కుటుంబాలూ ఛిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, ఎవరూ మత్తుకు అలవాటు పడవద్దని సూచించారు. మీ మిత్రుల్లో ఎవరైనా మత్తుకు అలవాటు పడి ఉంటే... మత్తు వల్ల కలిగే అనర్థాలు తెలిపి చికిత్సకు తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్‌తో మనిషి ఆలోచనా శక్తి నశిస్తుందని, సామాజిక, మానసిక శారీరక అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు డబ్బుల కోసం నేరాలు .. హత్యలకు సైతం పాల్పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. అందరి సహకారంతో జిల్లాను డ్రగ్స్ రహితంగా మారుస్తామన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్ సైదా, సీఐలు వి.శ్రీనివాసులు, వై. శ్రీనివాసులు, రియాజ్ అహమ్మద్, వెంకటేశ్వర్లు, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ప్రతి వారం సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

- జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: భూ సమస్యలు పరిష్కరించడానికి ఇక నుంచి ప్రతి వారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కోర్టుహాలులో జాతీయ రహదారులకు భూ సేకరణ, రైతులకు చెల్లించే పరిహారం, రైల్వే లైనుకు భూ సేకరణ, ఏపీఐఐసీ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నేషనల్ హైవే అథారిటీ అధికారి గిడ్డయ్య, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకట శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ... జాతీయ రహదారుల కోసం భూములు కోల్పోయి అవార్డు పొందిన ప్రతి రైతుకూ పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల వద్ద ఉన్న ఆధారాలతో నోటీసులు అందజేయాలన్నారు. జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు రూ.11.04 కోట్లు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నేషనల్ హైవే–342లో రెండు ప్యాకేజీలకు సంబంధించి నల్లమాడ, గోరంట్ల, పుట్టపర్తి, ముదిగుబ్బ, బుక్కపట్నం, చిలమత్తూరు మండలాల్లోని ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్నారు. భూ సమస్యలు ఉంటే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. భూ సమస్యలకు సాధ్యమైనంత వరకూ సంబంధిత తహసీల్దార్లే పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుడి వేధింపులపై విచారణ



మాట్లాడుతున్న విచారణ కమిటీ సభ్యులు



ఆస్పత్రిలోని డాక్టర్ గదిలో తలుపులు వేసుకొని విచారణ చేస్తున్న దృశ్యం

- నలుగురు మహిళా వైద్యులతో కమిటీ
- ఆస్పత్రికి వెళ్లి విచారణ చేసిన సభ్యులు
- బాధిత ఏఎన్‌ఎంల నుంచి వివరాల సేకరణ
- విచారణకు గైర్హాజరైన డాక్టర్ ఉదయ్

చెన్నేకొత్తపల్లి: ఏఎన్‌ఎంలను వేధిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చెన్నేకొత్తపల్లి మండలం ఎన్‌ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌పై జిల్లా వైద్యాధికారిణి మంజువాణి విచారణకు ఆదేశించారు. వైద్యుడు ఉదయ్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్నాడని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీలో పనిచేసే ఏఎన్‌ఎంలు మంగళవారం డీఎంహెచ్‌ఓ మంజువాణికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణకు డాక్టర్ నివేదిత, డాక్టర్ అనురాధ, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ వీరమ్మతో కూడిన కమిటీని డీఎంహెచ్‌ఓ నియమించారు. దీంతో నలుగురు మహిళా వైద్యులతో కూడిన కమిటీ బుధవారం ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఉదయం 10 గంటలకు ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీకి చేరుకున్న కమిటీ సభ్యులు సాయంత్రం వరకూ విచారణ చేపట్టారు. బాధిత ఏఎన్‌ఎంలతో పాటు ఇతర ఏఎన్‌ఎంలను విచారించారు. ఏఎన్‌ఎంలకు ఏపీ ఉద్యోగ సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు పలువురు మద్దతు తెలిపారు.

విచారణకు డాక్టర్ ఉదయ్ గైర్హాజర్..

విచారణ కమిటీ సభ్యులు బుధవారం ఆస్పత్రికి రానున్నట్లు తెలుసుకున్న డాక్టర్ ఉదయ్ విధులకు గైర్హాజరయ్యారు. ఆయన సెలవు కూడా పెట్టలేదని తెలుస్తోంది. దీంతో విచారణ కమిటీ సభ్యులు ఆయన కోసం సాయంత్రం వరకు వేచి చూసినా ఫలితం లేకపోయింది. ఫోన్‌లోనూ అందుబాటులోకి రాకపోవడంతో కమిటీ సభ్యులు వెళ్లిపోయారు.

ఆస్పత్రి ఎదుట ఏఎన్‌ఎంల ఆందోళన

కాగా, విచారణ తమకు అనుకూలంగా జరగడం లేదని ఏఎన్‌ఎంలు భావించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతినేలా ప్రవర్తించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాల్సిందేనని కమిటీ సభ్యులను కోరారు. ఈ క్రమంలోనే విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకుడు లింగన్న ఆస్పత్రి వద్దకు చేరుకుని ఏఎన్‌ఎంలతో మాట్లాడారు. అనంతరం వారితో కలిసి ఆస్పత్రి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన డాక్టర్ ఉదయ్‌ను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

చర్యలకు సిఫార్సు చేస్తాం..

ఆస్పత్రికి వస్తున్నట్లు ముందుగా తెలిపినప్పటికీ డాక్టర్ ఉదయ్ గైర్హాజర్ కావడాన్ని విచారణ కమిటీ సభ్యులు తీవ్రంగా పరిగణించారు. హాజరు పట్టికలో విధులకు గైర్హాజరైనట్లు రికార్డ్ చేస్తామన్నారు. విచారణను నిష్పక్షపాతంగా చేసినట్లు తెలిపారు. నివేదికను డీఎంహెచ్‌ఓకు అందజేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



ఎన్ఎస్‌గేట్ ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ అభివృద్ధితో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డ్రైవర్లకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజారవాణా అధికారి టి.మధుసూదన్ సూచించారు. అనంతపురంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన డ్రైవర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. డ్రైవరు వృత్తి అనేది కత్తిమీద సాములాంటిదన్నారు. ఒక్క డ్రైవరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలిగే నష్టం ఎన్నటికీ పూడ్చలేనిదన్నారు. నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే క్రమంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి వ్యాయామం, పౌష్టికాహారంతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఆర్టీసీ పంచసూత్రాలను పాటిస్తూ మంచి నడవడికతో సంస్థ అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

సౌత్ జోన్ జట్టులో ధర్మవరం బాలికలకు చోటు


ఎంపికైన బాలికలతో కోచ్‌లు

ధర్మవరం అర్బన్: సౌత్‌జోన్ క్రికెట్ జట్టులో ధర్మవరం బాలికలకు చోటు దక్కినట్లు క్రికెట్ కోచ్ రాజశేఖర్, కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం చేపట్టిన ఎంపిక ప్రక్రియలో అండర్–19 విభాగానికి నాగజ్యోతి, తేజుదీపిక ఎంపికయ్యారన్నారు. ధర్మవరం ఆర్డీటీ క్రికెట్ కోచింగ్‌సెంటర్‌లో సాధన చేస్తున్న వీరు ఈ నెల ఈ నెల 28 నుంచి జులై 8వ తేదీ వరకూ అనంతపురంలో జరిగే అండర్–19 సౌత్‌జోన్ టోర్నీలో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు రమణ


తలుపుల: చికెన్ కొనుగోలు చేసేందుకు వెళుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో నివాసముంటున్న ఎం.రమణ (45) తన కుటుంబసభ్యులతో కలసి బుధవారం ఉదయం స్వగ్రామమైన తలుపుల మండలం వేమలగొందికి వచ్చాడు. కుటుంబసభ్యులను తన చెల్లెలు ఇంట్లో దింపిన అనంతరం చికెన్ తీసుకొస్తానని తెలిపి ద్విచక్ర వాహనంపై పెద్దన్నవారిపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వేగ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. కాగా, రమణకు భార్య లక్ష్మి, కుమారుడు శ్రీనివాసులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

20 రోజులుగా అక్కడే...


రోడ్డు పక్కన వదిలేసిన వాహనం

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గత 20 రోజులుగా రోడ్డు పక్కన ద్విచక్రవాహనం ఆపి ఉందని, యజమాని ఎవరో కూడా తెలియడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ వాహనం ఎవరిదో? ఎందుకు అక్కడ వదిలేశారో? ఆరా తీయాలంటూ పోలీసులను గ్రామస్తులు కోరారు.

పచ్చదనం మధ్య మోడుబారి



ఎటు చూసినా పచ్చని తోటలతో ఆహ్లాదకరంగా ఉండే ప్రాంతమది. మధ్యలో మోడువారిన చెట్టు... అటుగా వెళుతున్న వారి దృష్టిని ఆకర్షిస్తోంది. బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఈ దృశ్యం కనిపిస్తోంది. ఈ భారీ వృక్షం ఎందుకిలా మారిందో తేలాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నకిలీ వైద్యులపై కఠిన చర్యలు

- జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫక్రుద్దీన్


మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసి బయటకు వస్తున్న వైద్యాధికారులు

తనకల్లు: అనుమతుల్లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తున్న నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మాస్ మీడియా అధికారి (డీఈఎంఓ) బాబాఫకృద్దీన్ హెచ్చరించారు. తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌లో ఉన్న ప్రైవేట్ ల్యాబ్‌లు, ప్రథమ చికిత్స కేంద్రాలను మండల వైద్యాధికారి ధర్మరాజుతో కలసి బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విషయాన్ని ముందుగానే పసిగట్టిన బాలాజీ డయాగ్నొస్టిక్ ల్యాబ్ నిర్వాహకులు తలుపులు వేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్‌బాబును హెచ్చరించారు. సెలైన్ పెట్టడం, ఇంజక్షన్ వేయడం, రోగులను అడ్మిట్ చేసుకోవడం తదితరాలు చేయరాదన్నారు. అనుమతి లేకుండా ల్యాబ్ నిర్వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మెడికల్ స్టోర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఓబులేసు, సూపర్‌వైజర్లు సూర్యనారాయణరెడ్డి, సావిత్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

- కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ రమేష్


మ్యాప్ రీడింగ్‌పై సూచనలిస్తున్న కమాండర్ కల్నల్ ఎస్.రమేష్

కూడేరు: ఎన్‌సీసీ అంటే ఐక్యత, క్రమశిక్షణకు మారు పేరు అని కర్నూలుకు చెందిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.రమేష్ అన్నారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న 6వ ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణా తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తల్‌సైనిక్‌కు ఎంపికైన క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. వారి మ్యాప్ రీడింగ్ సామర్థ్యాన్ని, ఫైరింగ్ నైపుణ్యాన్ని పరిశీలించారు. ఐజీసీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో కర్నూలు గ్రూపునకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్యాడెట్లకు పిలుపు నిచ్చారు. క్యాడెట్లు ఉండే గదులు, పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం క్యాడెట్లతో సమావేశమై మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. ఇక్కడ నేర్పించే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాయన్నారు. 10 రోజులు పాటు నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో ఆచరణలో పెడుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ కులకర్ణి, సుబేదార్ మేజర్ బల్బీర్‌సింగ్, ఎన్‌సీసీ అధికారులు ఏఎన్‌ఓ లెఫ్టినెంట్లు బాలకృష్ణ, మల్లేష్, అమరేష్, 28వ ఆంధ్రా బెటాలియన్ బాయ్స్ కర్నూలు ఎన్‌సీసీ ఇన్‌స్పెక్టర్ శ్యాం కుమార్, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

- అనంత ఆర్‌ఎం సుమంత్.ఆర్.ఆదోని

ఉరవకొండ: ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల పరిధిలో కారుణ్య నియమకాల కింద 89 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్.ఆర్.ఆదోని తెలిపారు. బుధవారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల పరిధిలో 491 సర్వీసులు నడుస్తున్నాయన్నారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 31 సర్వీసులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 11 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు ఉన్నాయన్నారు. జిల్లాకు మరో 40 ఆర్టీసీ, 30 హైయ్యర్ బస్సుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే ఉరవకొండ, గుంతకల్లు ఆర్టీసీ డిపోలకు గ్యారేజీ యార్డులు మంజూరైనట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ఇందన పొదుపుపై జిల్లా వ్యాప్తంగా 240 మంది డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.2023–24 సంవత్సరానికిగాను నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన సిబ్బందికి అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ డీఎం బాలాజీదయాళ్, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డపారతో కొడుకు దాడి... తండ్రి మృతి

కూడేరు: గడ్డపారతో కొడుకు దాడి చేయడంతో తండ్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కమ్మూరుకు చెందిన బోయ చిన్న ఆంజనేయులు(70)లకు భార్య శాంతమ్మ, కుమారుడు తిరుపాలు, కూతురు ఉమాదేవి ఉన్నారు. కొన్నేళ్లుగా మతి స్థిమితం లేక బాధపడుతున్న ఆంజనేయులు కుమారుడిని ఎప్పుడు తిడుతూ ఇతరుల వద్ద చెడుగా చెప్పుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అందరి ఎదుట అనవసరంగా తిట్టడంతో క్షణికావేశానికి లోనైన తిరుపాలు గడ్డపారతో ఆంజనేయులుపై తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య సేవలందేలోపు ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కమ్మూరుకు వెళ్లి విచారించారు. మృతుని భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల గృహ నిర్మాణాలపై నిందలా?

- ఇప్పటికైనా పద్ధతి మార్చుకోండి
- ఎల్లోమీడియాకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హితవు


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: 'రూ.1.80 లక్షలకు 272 చదరపు అడుగుల ఇంటిని నిర్మిస్తామని దేశంలో ఎవరూ చెప్పి ఉండరు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు లక్షల మందికి పక్కా గృహాలు కట్టిస్తామని హామీ ఇచ్చారు. అదే స్ఫూర్తితో నా వంతుగా నిపుణుల సహకారం తీసుకుని అదే మొత్తానికి పేదల గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టాం. ఈ నిర్మాణాలపై ఎల్లో మీడియా ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురించడం సరికాదు' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు అసత్య కథనాలు ప్రచురిస్తున్నాయని మండిపడ్డారు. పథకంలో భాగంగా లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులను ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన రాక్రీట్ సంస్థకు వారు చెల్లించిన తర్వాతనే ఆయా దశల పనులు పూర్తి చేస్తూ వచ్చిందని వివరించారు. బిల్లులు ఆలస్యం కావడంతో లబ్ధిదారులు సదరు సంస్థకు డబ్బులు చెల్లించలేదు. అనంతపురంలో రూ.6 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ కారణంగా పనులు ఆగిపోయాయి. అంతే కానీ అనవసరంగా సంస్థ గురించి వ్యతిరేక ప్రచారం చేయడం తగదు. దీనివల్ల లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ బకాయి బిల్లులు ఇప్పించగలిగితే వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయిస్తాం.' అని అన్నారు.

కనీసం ఆలోచించాలి కదా?

రూ.600తో చదరపు అడుగు చొప్పున నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి సిమెంట్, ఐరన్ వాడుకున్నారంటూ ఎత్తి చూపిస్తున్న వారికి అమరావతిలో చదరపు అడుగు రూ.10 వేలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. అసత్యాన్ని ప్రచారం చేసేటప్పుడు కాస్త ఆలోచించాలని హితవు పలికారు. పనులు ఆగేలా చేసి పేదలకు నష్టం కల్గించే విధానం మంచి పద్ధతి కాదన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు మంచి పనులు చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు జిల్లా మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు మంచి చేస్తే స్వాగతిస్తామన్నారు. హంద్రీ–నీవా కోటా నుంచి చిత్తూరు జిల్లాకు ఇవ్వాల్సిన 11.5 టీఎంసీ నీటిని గాలేరు–నగరి నుంచి ఇచ్చేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నాని గుర్తు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా ఆ 11.5 టీఎంసీల నీళ్లు మన జిల్లాకు సాధించుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జీఓ తెప్పించాల్సిన బాధ్యత మంత్రి కేశవ్‌పై ఉందన్నారు.

మీ ప్రభుత్వమే కదా నిరూపించండి..

అమ్మ డెయిరీ ఏర్పాటులో మహిళల నుంచి డబ్బు వసూలు చేసినట్లుగా గతంలో పరిటాల సునీత తనపై ఆరోపణలు చేశారని, ప్రస్తుతం ఆమెనే నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నారని, అందులోనూ ప్రభుత్వం కూడా వారిదే కావడంతో ఈ వ్యవహారంపై విచారణ చేయించి ఎవరితో డబ్బు వసూలు చేశానో నిరూపించాలన్నారు. అనవసర మాటలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు.

పాడి, పునరుత్పత్తి పెంపే లక్ష్యం

- పశుసంవర్ధకశాఖ జేడీ వై.సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: పాడి అభివృద్ధి, పశువుల పునరుత్పత్తి పెంపు, జీవాల సంరక్షణ లక్ష్యంగా ప్రతి మండలంలో పశువైద్య శిబిరాలు (గైనిక్ క్యాంపు) ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రీయ గోకుల మిషన్ (ఆర్‌జీఎం) పథకం కింద చేపట్టిన శిబిరాలకు అవసరమైన మందులు, ఇతర సామగ్రి కోసం ఉమ్మడి జిల్లాకు రూ.21.60 లక్షల బడ్జెట్ కేటాయించారన్నారు. ఈ లెక్కన ఒక్కో శిబిరానికి రూ.34,285లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం మండలం దుద్దుకుంట గ్రామంలో ఈ నెల 18న మొదలైన పశు వైద్య శిబిరాలు జూలై 26న యల్లనూరు మండలం మేడికుర్తి గ్రామంలో జరిగే శిబిరంతో ముగుస్తాయన్నారు. నాలుగైదు మాత్రమే మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తుండగా మిగిలినవన్నీ పల్లెలకు అనువుగా ఉన్న ఓ గ్రామంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కణేకల్లు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, రాయదుర్గం, డి.హీరేహాళ్, కంబదూరు, బొమ్మనహాళ్, బెళుగుప్ప, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో పశువైద్య శిబిరాల నిర్వహణ పూర్తయిందన్నారు. గురువారం ఉదయం వజ్రకరూరు మండలం రాగులపాడు, సాయంత్రం ఉరవకొండ మండలం షేక్షానుపల్లిలో ఉంటాయన్నారు. ఈ నెల 28న శెట్టూరు మండలం పెరుగుపాలెం, 29న కుందుర్పి మండలం వెంకటంపల్లి, జూలై 1న అనంతపురం రూరల్ మండలం మన్నీల, 2న కూడేరు మండలం కొర్రకోడు, 3న నార్పల, 4న రాప్తాడు మండలం ఎంబీ పల్లి, 8న ఆత్మకూరు మండలం తోపుదుర్తి, 9న బీకేఎస్ మండలం అమ్మవారిపేట, 10న గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లి, 11న గుత్తి మండలం అబ్బేదొడ్డి, 12న శింగనమల మండలం రాచేపల్లి, 18న పామిడి మండలం రామగిరి, 19న పెద్దవడుగూరు మండలం కడదరకుంట, 22న పెద్దపప్పూరు మండలం జూటూరు, 23న యాడికి, 24న తాడిపత్రి మండలం బొందలదిన్నె, 25న పుట్లూరు మండలం చింతకుంట, 26న యల్లనూరు మండలం మేడికుర్తి గ్రామాల్లో శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు, కాపర్లు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా కృత్రిమ గర్భోత్పత్తి, అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల నివారణ, పశుపోషణ, పాడి పెంపు మెలకువలు, దూడల పెంపకంలో జాగ్రత్తలు తదితర వాటికి సంబంధించి సలహాలు, వైద్య చికిత్స ఉంటుందని తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో పచ్చదనం పెంపునకు చర్యలు

అనంతపురం: నూతనంగా నిర్మించిన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో పచ్చదనం పెంపుదలకు చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి వినీత్ కుమార్‌అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో అటవీశాఖ సహకారంతో మొక్కల పెంపకాన్ని చేపట్టామన్నారు. సెంట్రల్ వర్సిటీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ నర్సరీల నుంచి మొక్కలు అందజేసి, సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణను హరితవనంగా మారుస్తామన్నారు. జీవ వైవిధ్యం మెరుగుపడే రీతిలో విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్లు, సామాజిక అటవీశాఖ రేంజ్ అధికారి పాల్గొన్నారు.

కోటంక క్షేత్రంలో చోరీ కేసు ఛేదింపు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- 16.261 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వెండి సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

అనంతపురం: గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రంలో చోటు చేసుకున్న చోరీ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. నలుగురు సభ్యులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి వెల్లడించారు.

చోరీ చేశారిలా...

ప్రసిద్ధ కోటంక కొండలోని గుంటి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఈ నెల 20న అర్ధరాత్రి దుండగులు చొరబడి 16 కేజీల వెండి ఆభరణాలు, 8 తులాల బంగారు ఆభరణాలు , రెండు హుండీలను పగులగొట్టి రూ.15 వేలు నగదును అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి 7.30 గంటలు పూజాదికాలు ముగించుకున్న తర్వాత ఆలయానికి తాళం వేసి అర్చకులు ఇళ్లకు వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు నాలుగు హుండీల్లో రెండు పగులగొట్టి భక్తులు సమర్పించిన నగదు, కానుకలతో పాటు గర్భగుడికి కన్నం వేసి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఈఓ బాబు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. స్నిఫ్ఫర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు.

స్వాధీనం చేసుకున్నవి ఇవే...

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్‌కు అలంకరించే రూ.13 లక్షల విలువైన 16.261 కిలోల వెండి ఆభరణాలు, అమ్మవార్ల మెడలో అలంకరించే నాలుగు బంగారు తాళి బొట్లు, రూ.2,500 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, కట్టర్, కటింగ్ ప్లేయర్, క్యాటర్ బాల్, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేవలం ఐదు రోజుల్లోనే...

ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి నేతృత్వంలో శింగనమల సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. క్లూస్‌టీం సేకరించిన వేలి ముద్రల ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు ఎవరైంది ఇట్టే పసిగట్టేశారు. గుడి పరిసరాల్లో వినియోగించిన ఫోన్ నెంబర్లు, కాల్ డేటా తదితర అంశాల ఆధారంగా కేవలం ఐదు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడైన సి.పవన్‌కుమార్ కర్నాటకలోని కోలారు, కొరటగేరి, పట్టణాయక్ హళ్లి, వైఎస్సార్ జిల్లా లింగాల, సిద్దవటం పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ఆలయాల్లో జరిగిన చోరీల్లో కీలక నిందితుడిగా గుర్తించారు. అలాగే ఆవుల రాముపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసు ఉంది. ఐదు రోజుల్లో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐలు శ్రీధర్, ఇస్మాయిల్, ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్, హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్, సిబ్బంది ఎం.దివాకర్, ప్రసాద్, దేవ్లా నాయక్, చంద్రశేఖర్, శ్రీధర్ పాణి, మల్లికార్జున, శ్రీనివాసులు, రంజిత్‌కుమార్, బాలకృష్ణను ఎస్పీ గౌతమిశాలి ప్రత్యేకంగా అభినందించారు.

పట్టుబడింది వీరే...

పేరు	ఊరు	మండలం	జిల్లా
సి.పవన్‌కుమార్	తురకలపట్నం	రొద్దం	శ్రీసత్యసాయి జిల్లా
ఆవుల రాము అలియాస్ ఎరికల రాము	ఎంఎంఎస్ తండా	సీకేదిన్నె	వైఎస్సార్ జిల్లా
వెంకటరమణ	కొత్తమదరమ్	ఒంటిమిట్ట	వైఎస్సార్ జిల్లా
ఈ.శ్రీనివాసులు	బాలకృష్ణనగర్	కడప	వైఎస్సార్ జిల్లా

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి

పుట్టపర్తి అర్బన్: వర్షా కాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులకు నోడలాఫీసర్ శివారెడ్డి సూచించారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులు, సంప్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. తరచూ క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. పైప్‌లైన్లలో లీకేజీలు అరికట్టాలన్నారు. నీటి నిల్వలు, ఇళ్ల మధ్య పేడ దిబ్బలు తొలగించేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. సర్పంచులను సమన్వయం చేసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేద్దాం

పుట్టపర్తి రూరల్: అడాల్ట్ బీసీజీ వ్యాక్సినేస్‌ను విజయవంతం చేద్దామంటూ వైద్య ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పిలుపునిచ్చారు. ఎనుములపల్లి పీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, పీహెచ్‌సీ పరిసరాలు, ల్యాబ్, కాన్పుల గది, సూది మందుల నిల్వలు పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. నిబంధనల మేరకు ఆరు ప్రమాణాలు కలిగిన వ్యక్తులకు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌ఓ నగేష్, సిబ్బంది అమ్మాజీ, నాగవేణి, శివ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.